

## సదస్సులో 'అన్నమాచార్య' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ :** అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ సదస్సులో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-బ్లేజ్ 2కె-24 అను పేరిట ఎస్.వి.యూనివర్సిటీ, ఇఇఇ విభాగం తిరుపతిలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో ఆటోమేటిక్ ఇరిగేషన్ సిస్టమ్ విత్ వైర్లెస్ కంట్రోల్ అండ్ ఎన్విరాన్మెంటల్ మానిటరింగ్ బై యూజింగ్ సోలార్ పవర్ అను అంశంపై నమూనాను ప్రాజెక్టు ఎక్స్‌ఫోలో ప్రదర్శించినందుకు బి.తేజరాజు, ఉమా మహేశ్వరి, తేజా శ్రావణి, ఉదయ్ మొదటి బహుమతి అందుకున్నారని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభచాటిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డి, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలితలు అభినందించారు.

మేమంతా సిద్ధం బహిరంగ సభలో మాట్లాడుతున్న వై.ఎస్.జగన్



# మోసపోతే అంధకారమే

- వైసిపికి ఓటేయకపోతే సంక్షేమానికి పాతరే
- చిన్నాన్న హంతకుడికి మద్దతు ఇస్తున్నదెవరో అందరికీ తెలుసు
- మేమంతా సిద్ధం సభలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి-కడప ప్రతినిధి/ప్రొద్దుటూరు/వేంపల్లె/ఎర్రగుంట్ల/దువ్వూరు**

కేంద్రంలోని బిజెపి, టిడిపి, జనసేన పొత్తు పేరుతో మరోసారి పేదలను మోసగించడానికి ముందుకొచ్చాయని, మోసపోతే సంక్షేమాన్ని గంగలో కలపడం ఖాయమని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండలంలోని ఇడుపులపాయలోని వైఎస్ఆర్ విగ్రహానికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేసిన అనంతరం రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. వేంపల్లి, వీరపునాయునిపల్లి, యర్రగుంట్ల మండలాల మీదుగా సాయంత్రానికి ప్రొద్దుటూరు నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధికి అడ్డు పడుతున్న దుష్టచతుష్టయంపై అర్జునుడిలా గాండీవం పూరించానన్నారు. ప్రజల మద్దతు లేని చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తన వాళ్లనే చంద్రబాబు తన మీద ఉసిగొల్పుతున్నారని తెలిపారు. వివేకా చిన్నాన్నను అన్యాయంగా అతిదారుణంగా చంపారన్నారు. ఆ హంతకులెవరో ఆ దేవుడికి, ఈ జిల్లా ప్రజలకు తెలుసు, చంపిన హంతకుడు బహిరంగంగా తిరుగుతున్నాడని, ఆ హంతకుడికి మద్దతు ఎవరిస్తున్నారో అంతా చూస్తున్నారని పేర్కొన్నారు. ఆ చంపినోడు ఉండాల్సింది జైల్లో కానీ నేరుగా నెత్తిన పెట్టుకుని మద్దతు ఇస్తోంది చంద్రబాబు, ఎల్లో మీడియా కాదా అని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం తపించిపోతున్న ఒకరిద్దరు నావాళ్లు భాగమయ్యారన్నారు. ఇంతటి దారుణం చేసి నన్ను దెబ్బ తీయాలనుకుంటున్నారని చెప్పారు. ఇంత కన్నా అన్యాయం ఉంటుందా అని తెలిపారు. ప్రజల మద్దతు లేని చంద్రబాబు చేస్తున్న నీచ రాజకీయం చేసినా నేను మాత్రం ప్రజల పక్షం ఉంటానన్నారు. నాపై బురద జల్లుతూ రాజకీయం చేస్తున్నారని చెప్పారు. అందరూ కలిసి జగన్‌పై యుద్ధానికి వస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, దత్తపుత్రుడు, బిజెపి, కాంగ్రెస్ నాపై యుద్ధానికి కలిసి కట్టుగా వస్తున్నారన్నారు. ఇది చాలదన్నట్లు నా ఇద్దరు చెల్లెల్ని తీసుకొస్తున్నారన్నారు. నేను ధర్మాన్ని, న్యాయాన్ని నమ్ముకున్నానన్నారు. చంద్రబాబు బృందానికి నమ్మించి నట్టేట ముంచేందుకు 45 ఏళ్ల అనుభవం ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు అవగానే మేనిఫెస్టోను చెత్తబుట్టలో పడేయడంలో అనుభవం సంపాదించాడన్నారు. గోబెల్స్ ప్రచారంలోనూ, కుటుంబాలను చీల్చడంలోనూ అనుభవం గడించారని విమర్శించారు. 2014లో ఇదే కూటమి మేనిఫెస్టో ఎన్నికలు అవగానే వెబ్‌సైట్ దగ్గర నుంచి ఎక్కడా కనిపించకుండా చేసిన ఘనత వారిదని ఎద్దేవా చేశారు. 58 నెలల వ్యవధిలో రాష్ట్ర చరిత్రలో ఎవరూ చూడని, ఊహించని విధంగా పాలన సాగించామని తెలిపారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామానికి, పట్టణాలకు వెళ్లినా సచివాలయం, విలేజ్ క్లినిక్, ఆర్‌బికెలు కనిపిస్తాయని, ఎక్కడి సమస్యను అక్కడ పరిష్కరించడానికి పోలీస్ సోదరులను కూడా నియమించామని తెలిపారు. మున్సిపాలిటీలు మొదలుకుని స్థానిక సంస్థలన్నింట్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించామని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 2.30 లక్షల ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. మేనిఫెస్టోలోని ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. మరోసారి ఇదేబ్యాచ్ మీ ముందుకు వస్తోందని, మేనిఫెస్టోలో ఇంటింటికీ సూపర్‌సిక్స్ పేరుతో మోసానికి సిద్ధమ య్యాయని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, రవీంద్ర నాథరెడ్డి, ఎం.వి సుధీర్‌రెడ్డి, డాక్టర్ సుధ, అంజాద్‌బాషా, జింకా విజయలక్ష్మీ, డిసిసిబి ఛైర్మన్ ఝాన్సీ, మున్సిపల్ చైర్ పర్సన్ బి.లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు. దువ్వూరు మీదుగా నంద్యాల జిల్లాకు బయలుదేరి వెళ్లారు.



తండ్రి సమాధికి నివాళులర్పిస్తున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో విజయమ్మ

ప్రజాగళం బహిరంగ సభలో మాట్లాడుతున్న నారాచంద్రబాబునాయుడు




# 'సీమ' ద్రోహి జగన్

- రాష్ట్ర అభివృద్ధి కోసమే ఎన్‌డిఎతో కలయిక
- అధికారంలోకి రాగానే మదనపల్లిని జిల్లా చేస్తాం
- మదనపల్లె ప్రజాగళం సభలో నారా చంద్రబాబు నాయుడు

**ప్రజాశక్తి-మదనపల్లె/రాయచోటి**

రాయలసీమ ద్రోహి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి అధి.కారంలోకి రాగానే మదనపల్లిని జిల్లా చేస్తామని హామీ ఇచ్చారు. బుధవారం రాత్రి స్థానిక బెంగళూరు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంపైన వ్యతిరేకతను ఓటు రూపంలో చూపించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో అంతిమ విజయం నిజాయ తీదేనన్నారు. ముస్లింల జీవితాలను ఛిద్రం చేసిన ఘణత వైసిపిదేనన్నారు. బటన్ నొక్కే ముఖ్యమంత్రి బటన్ నొక్కిన తర్వాత ఎంత బొక్కాడో చెప్పాలని తెలిపారు. రావణాసుర పాలన అంతమయ్యే రోజులు దగ్గర పడ్డాయన్నారు. కరెంట్ బిల్లులు అమాంతం పెంచి పేదల రక్తాన్ని పీల్చే జలగను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పెరిగిన కరెంట్, ఇంటిపన్నులు, పెట్రోల్, డీజిల్, రిజిస్ట్రేషన్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు మనసులో పెట్టుకుని ఓటు వేయాలని కోరారు. నిరుద్యోగం పెరిగిపోయిందని జాబ్ కేలండర్ ఇస్తానని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే తామంతా మిత్రపక్షంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. మద్యానికి అలవాటు పడినవారు పగలంతా కష్టపడి రాత్రి అయితే సంపాదించిన డబ్బులు పెరిగిన మద్యం ధరలకు పెట్టి ఇంటికి ఏమీ తీసుకెళ్లలేక నరకయాతన పడుతున్నారని తెలిపారు. ఓట్ల కోసం అందరికీ మద్యం తాగిస్తారని ఆ మత్తులో ప్రజలు ఉంటే ఓట్లు వాళ్లే వేసుకుంటారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంటుందన్నారు. అధికారులు ఇన్నాళ్లూ అధికార పార్టీకి సహా యపడ్డారని అయితే ఉన్న కొన్ని రోజులైనా పారదర్శకంగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వంలో జీతాలు రాని పరిస్థితి ఉందని దాన్ని టిడిపి అధిగమించి అందరికీ సరైన సమయంలో జీతాలు అందజేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రం గంజాయి మత్తులో ఊగుతోందని మదనపల్లెలో కూడా గంజాయిని యువతకు అలవాటు చేశారన్నారు. తన ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో జగన్మోహన్‌రెడ్డి లాంటి పనికిమాలిన ముఖ్యమంత్రిని చూడలేదని పేర్కొన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు ప్రవేశపెట్టి హంద్రీ-నీవా మొదలు పెట్టానని గుర్తు చేశారు. మదనపల్లె ప్రజలకు తాగు, సాగునీరు అందించే దిశగా తాను ఎంతో కృషి చేస్తే ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క టిఎంసి నీరు కూడా ఇచ్చిన దాఖాలాలు లేవన్నారు. మైనార్టీలు అందరూ జనసేన, బిజెపి పొత్తుతో ఎవరికీ నష్టం కలగనివ్వనని హామీ ఇచ్చారు. గతంలో చేసిన అభివృద్ధికంటే ఈసారి మదనపల్లెలో షాజహాన్ బాషాను గెలిపిస్తే రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి చేసి చూపి స్తాయన్నారు. సిద్ధం అంటున్నారు ... దేనికి సిద్ధం.. ఓడిపో వడానికి వైసిపి సిద్ధమన్నారు. సొంత చెల్లిని గౌరవించలేని వాడికి ఆడపడుచులను ఎంత మాత్రం గౌరవిస్తాడో ఆలోచించాలని తెలిపారు. టిడిపి రాగానే విద్యుత్ భారం తగ్గిస్తామని, అన్నా క్యాంటీన్‌లు తెరచి పేదవాడికి అన్నం పెడతామని తెలిపారు. పాపాల పెద్దిరెడ్డి అన్నం తినడం మానేసి ఉదయం అల్పాహారం కింద ఇసుక, మధ్యాహ్న భోజనం కింద మైనింగ్ రాత్రి భోజనానిని ఇరిగేషన్ ప్రాజెక్టులు తినేస్తున్నాడన్నారు. పుంగనూరుకు తండ్రి తంబళ్లపల్లికి చిన్నాన్న , రాజంపేటకు కొడుకు ఉండటానికి మీకేమైనా అన్నమయ్య జిల్లాను రాసి ఇచ్చేశారా అని ప్రశ్నించారు. హంద్రీనీవా డబ్బులను పక్కదారి పట్టిస్తు న్నారని తానొస్తే అక్రమ కేసులు పెట్టించారన్నారు. మదనపల్లెలో భూకబ్జాలకు పాల్పడుతున్న వారిని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు, మదన పల్లె, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లె, రాయచోటి టిడిపి అభ్యర్థులు షాజహాన్ బాషా, నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి, జయచంద్రరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, నాయకులు ఎస్.మస్తాన్, పఠాన్‌ఖాదర్‌ఖాన్, నాదెండ్ల విద్యా సాగర్, నాదెండ్ల శివన్న, శ్రీరామ్ చిన్నబాబు, ఆర్‌జెడి వెంకటేష్, పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్నచంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సాహెబ్

## ముస్లిముల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు : కాంగ్రెస్

**ప్రజాశక్తి-మదనపల్లి**

కేంద్రంలోని బిజెపితో అంటకాగుతున్న టిడిపి, జనసేన, వైసిపిలకు ముస్లిం మైనార్టీల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని మదనపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ గతంలో ముస్లింల హక్కులకు భంగం కలిగించే ఎన్ఆర్‌సి, సిఎఎ చట్టాలను బిజెపి ప్రభుత్వం తీసుకొస్తే అప్పట్లో టిడిపి అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు వాటిని నల్లచట్టాలుగా అభివర్ణించారని, వాటిని రద్దు చేయాలని నిరసనలు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. స్వార్థ ప్రయోజనాల కోసమే చంద్రబాబు నాయుడు ముస్లిం మైనార్టీలను పావులుగా వాడుకుంటున్నారన్నాని తెలిపారు. ఎన్‌డిఎ కూటమికి మద్దతు తెలపడం పెద్ద తప్పిదమన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు ఎంతో మేలు చేశారని, ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన పరోక్షంగా కేంద్రం అమలు చేస్తున్న చట్టాలకు మద్దతునిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కె.బాషా, రూరల్ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మండల మహిళా అధ్యక్షులు ఆయేషా, పట్టణ మహిళా అధ్యక్షులు ఈశ్వరమ్మ, జిల్లా నాయకులు చలపతి, సమీర్, పాలేటి, మహబూబ్ పీర్, సీనియర్ నాయకులు మస్తాన్, అమీర్‌జాన్, మహమ్మద్‌అలీ, నాగరాజ, శరత్ కుమార్‌రెడ్డి, అన్వర్, సయ్యద్, ఖాసీం, సోను, విజయ్ కుమార్, షమి, రిజ్వానా, ప్రమీల పాల్గొన్నారు.

## బస్సుల్లేక ప్రయాణీకులకు ఇక్కట్లు

- బస్టాండులో గంటలకు గంటలు పడిగాపులు

**ప్రజాశక్తి-పీలేరు :** ప్రయాణికులు పీలేరు నుంచి తమ గమ్యానికి చేరడం కోసం తగినన్ని బస్సుల్లేక అనేక ఇక్కట్లు ఎదుర్కోవలసిన పరిస్థితులు నెలకొంది. బుధవారం నుండి శనివారం వరకు రాయలసీమ జిల్లాల్లోని ప్రొద్దుటూరు, నంద్యాల, ఎమ్మిగనూరు, కర్నూలులో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార కార్యక్రమాలు జరగనుండడంతో ఆయా సభలకు అవసరమైన జన సమీకరణ కోసం రాష్ట్ర ప్రజా రవాణా సంస్థ అన్నమయ్య జిల్లా నుంచి 192 బస్సులను సమకూర్చింది. పీలేరు డిపో నుంచి 43 బస్సులు ముఖ్యమంత్రి సభా కార్యక్రమాల కోసం పంపారు. గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు బస్సులనే అధికంగా పంపడంతో పల్లె ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అనేక తండాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. తిరుపతి, చిత్తూరు, రాయచోటి, మదనపల్లి వెళ్లే ప్రయాణికులు సైతం గంటలకు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి చోటు చేసుకుంది. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు తమ ఊరికి వచ్చే ఒకటి అర బస్సులు కూడా లేకపోవడంతో తమ ఊర్లకు ఎలా చేరాలో దిక్కు తోచడం లేదన్న ఆవేదనను వ్యక్తం చేస్తూ చర్చించుకోవడం గమనార్హం. ఇదే పరిస్థితిని ప్రయాణికులు శనివారం వరకు ఎదుర్కోక తప్పదు మరి.



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

## 'ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

ఒంటిపూట బడుల నిబంధనలు తుంగలో తొక్కుతూ ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా పాఠశాలలు నడుపుతున్న శ్రీసాయి విద్యాలయ, భారతీయ విద్యానికేతన్, అక్షర పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర డిమాండ్ చేశారు. ఒంటిపూట బడుల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడుపుతున్నారంటూ బుధవారం ఎంఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తీవ్రస్థాయిలో మండుటెండలు విరుచుకుపడుతున్న సమయంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తుంటే కొన్ని ప్రయివేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడుపుతున్నారని ఆరోపించారు. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పాఠశాలలపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడంలో అనంత జయం ఏమిటో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. తక్షణమే మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణగా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల ఆగడాలపై పెద్ద ఎత్తున నినదిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శివమణి, మనోహర్, గౌరీ శంకర్, చెంగయ్య పాల్గొన్నారు.

## స్నేహితుడికి తోడుగా వెళ్లి... రోడ్డు ప్రమాదంలో 'పది' విద్యార్థి మృతి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

రోడ్డు ప్రమాదంలో పదవ తరగతి విద్యార్థి మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన విషాదకర సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...తండ్రికి భోజనం ఇచ్చి, ఫైనల్ పరీక్షకు వెళ్లవచ్చులే అని వెంకటేష్ భావించి తన తోటి స్నేహితుడు సాయి చరణ్‌ని వెంటబెట్టుకొని మలకలచెరువు మండలంలోని చీకటిమారేపల్లికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అల్లనేరేడు చెట్ల వ్యవసాయం చేస్తుండడంతో తండ్రి భోజనం బస్సులో పెట్టి పంపించమని ఇంట్లో చెప్పడంతో ద్విచక్ర వాహనంలో వెళ్లి ఇచ్చేసి రావచ్చుని ఉద్దేశంతో వారు బయలుదేరి వెళ్తుండగా పిటిఎం మండలం కాట్నగల్లు గ్రామానికి చెందిన నరసింహులు, శ్యామ్ కాట్నగల్లు నుంచి గ్యాస్ సిలిండర్ తెచ్చుకునేందుకు పిటిఎంకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా మద్దయ్యగారిపల్లి పంచాయతీ సమీపంలోని కుమ్మరవారిపల్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. బి.కొత్తకోట పట్టణంలో కాపురముంటున్న పిటిఎం మండలంలోని పోతుపేట గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ కుమారుడు సాయి చరణ్(15)కు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు మదనపల్లి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సాయి చరణ్ తండ్రి ఉద్యోగ రిత్యా మలకలచెరువు పోలీసుస్టేషనులో హెడ్‌కానిస్టేబులుగా విధులు నిర్వహిస్తున్నారు. కాట్నగల్లు నుంచి గ్యాస్ సిలిండర్ కోసం పిటిఎం వస్తున్న వారిలో నరసింహులు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడ్డ వెంకటేష్‌కు చేయి, కాలు విరిగినట్లు డాక్టర్లు తెలిపారు. మరో వ్యక్తి శ్యామ్‌కు గాయాలైనట్లు డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనపై పిటిఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బి.కొత్తకోట పట్టణంలోని శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్‌లో సాయిచరణ్, వెంకటేష్ ఇద్దరు పదవ తరగతి చదువుతున్నట్లు బంధువులు తెలిపారు. సాయిచరణ్ ప్రతిభ కలిగిన విద్యార్థి అని పాఠశాల ప్రిన్సిపల్ కేశవరెడ్డి తెలిపారు. డాక్టర్ కావాలని వారి తల్లిదండ్రులు ఎన్నో కలలు కన్నారని మెరిట్ స్టూడెంట్ మృతి చెందడం దురదృష్టకరమని స్కూల్ ప్రిన్సిపల్ కేశవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు.



సాయి చరణ్ మృతదేహం వద్ద రోధిస్తున తండ్రి వెంకటరమణ

## తాగునీటి సరఫరాలో జాప్యం జరిగితే చర్యలు

**ప్రజాశక్తి -రాయచోటి**

ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రతీ రెండు వారాలకు ఒక సారి ట్యాంకును శుభ్రపరచాలని, తాగునీటి సరఫరాలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసు బాబు పేర్కొన్నారు. బుధవారం వేసవి దృష్ట్యా రాయచోటి పట్టణంలో నీటి సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులు, నీటి సరఫరా సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీకి గాలివీడు మండలం వెలిగల్లు నుంచి ఎంతో వ్యయంతో నీటిని శుద్ధి చేసి పట్టణంలో 6 ట్యాంకుల ద్వారా ప్రజా అవసరాలకు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు అనవసరంగా నీటిని వృథా చేయరాదని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ, గర్ల్స్ హైస్కూల్, ఎన్‌జిఒ కాలనీ డైట్, రాయుడు కాలనీ, మాసాపేటలోని ట్యాంకులను మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, ఫిట్టర్ రామకృష్ణ తో కలసి పరిశీలించారు. ట్యాంక్ కెపాసిటి, ఫిల్లింగ్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. 15 రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా ప్రతీ ట్యాంక్ బ్లీచింగ్‌తో శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ నీటి సరఫరా కార్మికుల హాజరును తనిఖీ చేశారు.



మాట్లాడుతున్న టిసిఎస్ కంపెని హెడ్ రిచర్డ్ కింగ్

## 'మిట్స్'లో జాతీయ స్థాయి సింపోజియం

**ప్రజాశక్తి-మదనపల్లి**

మిట్స్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో టెక్నికల్ సింపోసియంను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ టిసిఎస్ కంపెనీ హైదరాబాద్ రీజియన్ హెడ్ రిచర్డ్ కింగ్ ఛత్రగడ్డ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీపై దినదినాభివృద్ధి గురుంచి తెలుసుకోవాలన్నారు. నూతన టెక్నాలజీలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ దిన దినాభివృద్ధి చెందుతున్నదని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే మన డైలీ రొటీన్ లైఫ్‌లోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చేసిందని తెలిపారు. తెల్లారి లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే దాకా అడుగడుగునా అది మన వెన్నంటే ఉంటోందన్నారు. విద్య నుంచి వైద్యం దాకా, వ్యాపారం నుంచి వ్యవసాయం దాకా ఇప్పుడు ప్రమేయం లేని రంగం లేదంటే నమ్మాల్సిందేనని పేర్కొన్నారు. గూగుల్ అసిస్టెంట్, అమెజాన్ అలెక్సా వంటి ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ఆధారిత ఎలక్ట్రానిక్ వస్తువులు మనలోకి వచ్చేశాయన్నారు. రిమైండర్‌లను సెట్ చేయడం, సందేశాలను పంపడం నుంచి, మ్యూజిక్ ప్లే చేయడం, స్మార్ట్ హోమ్ పరికరాలను నియంత్రించడం వరకూ అనేక రకాల పనులను ఎఐ ద్వారా చేయగలమనే విషయాన్నీ అందరం తెలుసుకోవాలన్నారు. మనిషి తన ఆలోచనతో, తనకన్నా బలమైన యంత్రాలను ఎన్నింటినో సృష్టించాడన్నారు. ఎందుకంటే వాటికి ఆలోచనా శక్తి లేదని పేర్కొన్నారు. విద్యార్థులు మరింత ఆలోచనలతో నూతన పరిశోధనలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదన్, డీన్ కంప్యూటర్ సైన్స్ గౌతమ్ చక్రబర్తి పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కొరడా

- 583 ఫిర్యాదులకు 564 పరిష్కారం

**ప్రజాశక్తి - రాయచోటి**

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 583 ఫిర్యాదులు అందగా 564 ఫిర్యాదులకు పరిష్కరించామని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి వేర్వేరు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు మొత్తం 583 ఫిర్యాదులు అందగా 564 ఫిర్యాదులను పరిష్కరించగా 19 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని తెలిపారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్, సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.61.10 లక్షల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేయడం చేశామని తెలిపారు. ఇందులో రూ.26.81లక్షల మేర నగదు, రూ.14.89 లక్షల విలువైన లిక్కర్, రూ.1.40 లక్షల విలువైన గంజాయి, రూ.17.90 లక్షల విలువైన బంగారు, వెండి, ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. ఎంసిసి అతిక్రమణల కింద ఏడు కేసులు నమోదు చేశామన్నారు.

### రంజాన్ వేళలు



| ఇఫ్తార్ గురువారం (సా) | షహారీ శుక్రవారం (ఉ) |
| --- | --- |
| 6.30 | 4.58 |



వాహనదారులకు సూచనలిస్తున్న ఎంవిఐ, సిఐలు

## ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కలకడ

ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు పీలేరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయ్‌కుమారి, కలకడ సిఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. కలకడ, కె.వి.పల్లి మండలాల పరిధిలో ఉన్న ఎన్‌హెచ్-40 రోడ్డును పరిశీలించినట్లు తెలిపారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని వాటి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణాలను వివరిస్తూ గురించి వివరించినట్లు తెలిపారు. ప్రమాదాలు నివారించుటకు ప్రతి ఒక్కరూ సహకరించి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిని కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్సులు తప్పక ఉండాలని, చిన్న పిల్లలు వాహనాలు నడప రాదని తెలిపారు. కార్యక్రమంలో కలకడ ఎస్ఐ రామకృష్ణారెడ్డి, కడప, చిత్తూరు ఎఐలు రఘు, ప్రసన్నయాదవ్ పాల్గొన్నారు.

## 23 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలో 23 మందిని బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎసిఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గోపనపల్లి, తూముకుంట, గుట్లచెరువు గ్రామాలు చెందిన టిడిపి, వైసిపి పార్టీకు చెందిన 23 మందిని తహశీల్దార్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు తెలిపారు.

### బి.కొత్తకోటలో పది మందిపై...

బి.కొత్తకోట: మండల పరిధిలో పేకాట, అక్రమ మద్యం రవాణా, విక్రయాల కేసుల్లో నిందితులను బైండోవర్ చేసినట్లు బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ బి.కొత్త కోట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పాత కేసులలో ఉన్న కర్ణాటక మద్యం కేసుల నిందితులు, నాటుసారా విక్రయదారులు, పేకాట రాయుళ్లు మళ్లీ ఎలాంటి నేరాలు చేయకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా ఏదైనా నేరం చేస్తారేమోనని గుర్తించి తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కర్ణాటక మద్యం రవాణా, నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నిఘా మరింత కట్టుదిట్టం చేశామని ఆయన వెల్లడించారు.



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రభాకర్

## 'ఉపాధి' పనులు పరిశీలన

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపిడిఒ ప్రభాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు శుద్ధమల గ్రామ మినహా మిగిలిన 12 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఉపాధి పనులు డంపింగ్ యార్డ్ చెరువుల్లో పూడికతీత పనులు చేస్తున్నారని అన్నారు. కూలీలు రోజువారి దినకూలీ కనీసం రూ.272 పనులు చేయాలని చెప్పారు. కూలీలు ఉదయం 5.30 నుంచి 10.30 వరకు పనులు చేయాలని తెలిపారు. పనుల్లో కూడా నాణ్యత వచ్చే విధంగా ఫీల్డ్ సిబ్బందికి సూచించారు. కూలీలు ప్రస్తుతం 1050 మంది మండల వ్యాప్తంగా ఉపాధి కూలీ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి పనులు కావాల్సిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే వెంటనే పనులు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సురేంద్ర నాథ్‌రెడ్డి, టిఎలు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ

సుండుపల్లి: మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ నిర్మలమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఎరవరెడ్డి శరత్‌రెడ్డి 500 మంది ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా సరుకులు పంపిణీ చేశారు. గతంలో తన ఎరవరెడ్డి మాట్లాడుతూ తల్లి నిర్మలమ్మ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఉండి అనేక అభివృద్ధి పనులు చేయించి గ్రామంలో డ్రైనేజీ కాలువలు వీధిరోడ్లు, వీధి దీపాలు అనేక పనులు చేయించి ప్రజల్లో గుర్తింపు పొందిందని అన్నారు. గిరి ఒక్కికి ముస్లిం సోదరులకు దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మూల్యాంకనాన్ని బహిష్కరిస్తాం : ఫ్యాప్టో

ప్రజాశక్తి - రాయచోటి: గత సంవత్సరం 10వ తరగతి జవాబు పత్రాలు దిద్దిన మార్కులు వేసిన బాధ్యతలకు గాను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు చెల్లించాల్సినటువంటి డిఎ రెమ్యూనరేషన్ ఇంతవరకు చెల్లించకపోవడం ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి, నిరాశ నిస్పృహలు ఉన్నాయని, అందువల్ల ఏప్రిల్ 1 నుంచి నిర్వహించబోయే మూల్యాంకనాన్ని బహిష్కరిస్తామని ఫ్యాప్టో నాయకులు పేర్కొన్నారు. బుధవారం డిఇఒ శివ ప్రకాష్ రెడ్డికి మరొకసారి వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని, లేకపోతే స్పాట్ బహిష్కరిస్తామని నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం తీవ్ర ఎండల్లో అరకొర సౌకర్యాలు నడుమ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరీక్ష పేపర్లను దిద్ది సకాలంలో మార్కులు వేశారని తెలిపారు. ఆయా జిల్లాల్లో పని చేసినటువంటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సినటువంటి రెమ్యూనరేషన్, డిఎను చెల్లించకపోవడంతో అనేకసార్లు జిల్లా అధికారులకు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఇంకా 20 లక్షల పైబడి ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఎన్నోసార్లు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ఫ్యాప్టో ఆధ్వర్యంలో స్పాట్ బహిష్కరణకు నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ స్పాట్ బహిష్కరణ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు అంకం శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాయచోటి రవి శంకర్, కో-చైర్మన్ గఫ్ఫార్ ఖాన్, ఉప కార్యదర్శి ఖలీఫాన్, యుటిఎఫ్ నాయకులు జబీర్, రూట నాయకులు సిబతర్ రెహ్మాన్, ఎస్‌టియు నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, కార్యదర్శి రామకృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# నిధులు ఇవ్వలేని సమావేశాలు ఎందుకు?

### - మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన సర్పంచ్‌లు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వలేని సమావేశాలు మాకెందుకంటూ సర్పంచ్‌లు వెళ్లిపోయిన సంఘటన నిమ్మనపల్లె సర్వసభ్య సమావేశంలో బుధవారం జరిగింది. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిడిఒ షాలెట్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు ఆలస్యంగా రాగా, హాజరు రిజిష్టర్‌లో కోరంకు అవసరమైన ఐదు మంది ఎంపిటిసి సభ్యులు సంతకాలు చేశారు. వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, ముష్టూరు ఎంపిటిసి వెంకటరమణ, సర్పంచ్‌లు, ప్రభుత్వ అధికారులు మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. ఎంపిడిఒ షాలెట్, తహశీల్దార్ బాలాజీ రాజు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నియమనిబంధనలు అమల్లో ఉన్నందున, అజెండా చర్చించడానికి వీల్లేదని, ప్రజలకు అత్యవసరమైన పనులకు సంబంధించి మాత్రమే చర్చ జరగాలని సూచించారు. ఇంతలో రాచవేటివారిపల్లె సర్పంచ్ సుబ్రమణ్యం(మధు), సామకోటవారిపల్లె సర్పంచ్ మహాదేవరెడ్డిలు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా మండల పరిషత్ నుంచి పంచాయతీలకు ఎటువంటి నిధులు ఇవ్వలేదని, ఏ మేరకు నిధులు ఇచ్చారో వివరాలు చెప్పాలని నిలదీశారు. తమ పంచాయతీల అభివృద్ధికి నిధులు ఇవ్వని మండల పరిషత్ సమావేశాలకు మేమెందుకు హాజరు కావాలని ప్రశ్నించారు. తమ గ్రామాల అభివృద్ధిని పట్టించుకోని కారణంగా మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని చెబుతూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రభుత్వ అధికారులు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. అనంతరం ఎంపిపి నరసింహులు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన వెంటనే గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించడానికి, ప్రజలకు అవసరమైన పనులను చేపట్టడానికి ప్రతి గ్రామానికి ప్రభుత్వం ద్వారా రూ.20 లక్షల చొప్పున నిధులు ఇచ్చామన్నారు. ప్రతి ఎంపిటిసికి మండల పరిషత్ నిధుల నుంచి మరో రూ.4 లక్షల చొప్పున అభివృద్ధి పనులకు నిధులను కేటాయించినట్లు చెప్పారు. ముఖ్యంగా వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు అవసరమైన చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు బోర్లు, మోటర్లు, పైప్ లైన్, మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, సర్పంచ్‌లు వరలక్ష్మి, సుబ్రమణ్యం, మహాదేవరెడ్డి, కే.రెడ్డప్ప, సింగల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఆర్ఐ రమణారెడ్డి, ఇఒపిఆర్‌డి చలపతిరావు, ఉద్యానవన శాఖాధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, మత్స్య శాఖాధికారి సుబ్బనరసయ్య, ఎఇలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ బాలాజీరాజు

# తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి : ఆర్‌డిఒ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ మోహన్‌రావు

ప్రజాశక్తి-వీరబల్లి

మండల వ్యాప్తంగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డిఒ మోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పోలు చిన్నారెడ్డిగారిపల్లి సమీపంలో ఉన్న మాండవ్య నదిని, ఒదివీడు సమీపంలో ఉన్న మాండవ్యనదిలో ఇసుక రీచ్‌ను తహశీల్దార్ శ్రీనివాసులుతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మండల ప్రజలకు, జంతువులకు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికా రులు సమన్వయంతో పనిచేసి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు. గ్రామాల వారిగా తాగు నీటి సమస్యను గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ఆయా గ్రామాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు స్థానిక నీటి వనరులను ఉపయోగించు కోవాలని సూచించారు. తాగునీటి సమస్య ఉన్న చోట రైతుల వేసుకున్న బోర్ల వద్ద నుంచి ట్యాంకర్లతో నీళ్లు అందించాలన్నారు. మండల హెడ్‌క్వార్టర్‌లో తాగునీటి ఓవర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కృష్ణయ్య, రెవెన్యూ ఆర్ఐ గోపి, పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, రెవెన్యూ, ఎంపిడిఒ సిబ్బంది పాల్గొన్నారు.

# 'పది' పరీక్ష కేంద్రాల్లో డివైఇఒ తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాలను మదనపల్లి డివైఇఒ శ్రీరామ్ పురుషోత్తం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది రోజులుగా జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పటిష్టంగా నిర్వహిస్తున్నామని అన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అందులో భాగంగానే బుధవారం నిమ్మనపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో, జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. బుధవారం జరిగిన సోషియల్ పరీక్షకు రెండు కేంద్రాలలో 344 మంది విద్యార్థులకు గాను 317 మంది విద్యార్థులు హాజరు కాగా, 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ పరీక్షలు మినహా పదవ తరగతి పరీక్షలు బుధవారంతో ముగిసాయని వివరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్నం భోజనం ద్వారా నాణ్యమైన భోజనం, యూనిఫామ్ బట్టలు, పుస్తకాలను ఉచితంగా అందిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని అన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డివైఇఒ శ్రీరాం పురుషోత్తం

# పేద విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్



మెటీరియల్ పంపిణీ చేస్తున్న కళాశాల చైర్మన్ భాస్కర్

ప్రజాశక్తి-రామాపురం

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలలోని పేద విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ తో పాటు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని బిట్స్ కళాశాల చైర్మన్ మన్నేరు భాస్కర్ తెలిపారు. మండలంలోని బండపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం పేద విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ మెటీరియల్‌ను ఉచితంగాపంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గవర్నమెంట్ పాలిటెక్నికల్ ఇసిహెచ్ ఒడి మధు సూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఈ కళా శాలల ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులకు 200 మందికి ఎంసెట్ కోచింగ్ ఉచితంగా ఇవ్వడంతో పాటు వారికి వసతి, భోజన సౌక ర్యవం కల్పించినట్లు చెప్పారు. ఎంతమంది విద్యార్థులు వచ్చినా వారికి ఉచితంగా కోచింగ్‌తో పాటు అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు ఎంసెట్ ర్యాంకు రాకపోతే ఉచితంగా తాను నాలుగేళ్ల పాటు ఫీజు లేకుండా ఉచితంగా విద్యను అందిస్తామని చెప్పారు. తమ కళాశాలలో సిఇసి, ఇఇఇ, ఎఇ, ఇసిఇ కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు తీసు కుంటామని తెలిపారు. కార్యక్రమంలో గవర్నమెంట్ పాలిటెక్నికల్ కళాశాల హెచ్‌ఒడి, ఇసిఇ మధుసూదన్‌రెడ్డి, బిట్స్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పారామెడికల్ ప్రిన్సిపల్ నాగేంద్ర, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీని విమర్శించే స్థాయి భాస్కర్‌కు లేదు

### - పంజం సుకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో అభివృద్ధిపై ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని విమర్శించే స్థాయి జనసేన పార్టీ అభ్యర్థి యనమల భాస్కర్ రావుకు లేదని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైసిపి కార్యాలయంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు సిఇగా పనిచేసిన భాస్కర్ రావుకు రైల్వే కోడూరులో అభివృద్ధి లేదనడం విడ్డూరంగా ఉందని అన్నారు. కెఎ పాల్‌కు నీకు ఏమి తేడా లేదని అన్నారు. అభివృద్ధి సంక్షేమం పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా అందించామని అన్నారు. కోడూరులో రైల్వే అండర్ బ్రిడ్జి,గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే,గుంజన నదికి రక్షణ గోడ,ప్రతి పంచాయతీలో గ్రామ వార్డు సచివాలయాలు, ఆర్‌బికెలు, విలేజ్ క్లినిక్‌లు ఇవన్నీ అభివృద్ధి కాదా అని అన్నారు. కోడూరులో 50 పడకల ఆస్పత్రిని నిర్మించి పోస్టుమార్టం వసతి కూడా కల్పించారని, ఇవన్నీ జనసేన అభ్యర్థికి కనపడవా అని ప్రశ్నించారు. మీరు వైసిపి కోవర్టు అని మీ పార్టీ వారే అంటున్నారని ఎక్కడైనా వైసిపి వారు అన్నారా అని చెప్పారు. ప్రజాక్షేత్రంలోకి రండి గెలవండి అని ఆయన సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైసిపి కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసి జనార్ధన్ రాజు, సర్పంచ్‌లు రామకృష్ణ, హరికృష్ణరెడ్డి, శ్రీరామ్ వినోద్, రాజా రెడ్డి, రమణారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

## గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో పీలేరు సిఐ మోహన్‌రెడ్డి తమ పోలీసు బలగాలతో గ్రామీణ ప్రాంతాల్లో కవాతు చేపట్టారు. బుధవారం పీలేరు మండలంలోని దొడ్డిపల్లి, అగ్రహారం, ఎర్రగుంటపల్లి, ఇందిరమ్మ కాలనీల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించుకోవడానికి, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవడానికి పోలీసు శాఖ తగిన రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

## రసీదు లేని రూ.3 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట పోలీసులు మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించి రూ.3 లక్షల నగదును సీజ్ చేశామని సిఐ సూర్య నారాయణ తెలిపారు. మండలంలోని బీరంగి సమీపంలోని తానామెట్ట చెక్‌పోస్టు వద్ద వాహనాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టా మన్నారు. బెంగళూరు నుంచి సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి ఎలాంటి రసీదులు లేకుండా కారులో తీసుకుని వస్తున్న రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన నగదును స్థానిక విఆర్ఒ ఉత్తర్వుల మేరకు ట్రెజరీలో జమ చేశామని తెలిపారు.

## నేటి నుంచి ఉచిత పాలిసెట్ కోచింగ్

ప్రజాశక్తి-సింహాద్రిపురం

మండలంలోని నిడువెలగల సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ తాతాజీ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పాలిసెట్‌లో మంచిర్యాంకు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.పాలిటెక్నిక్‌తో మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.



వృద్ధులకు కరపత్రాలు అందిస్తున్న వైసిపి నాయకులు

## అభివృద్ధిని చూసి పట్టం కట్టండి

ప్రజాశక్తి-కలకడ

రాష్ట్ర అభివృద్ధిని చూసి పట్టం కట్టాలని, ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి సోదరుడు మాజీ జడ్‌పిటిసి శివానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కదిరాయచెరువు పంచాయతీ చెరువు ముందర పల్లి, కదిరాయ చెరువు, చిన్నగోగులపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అబివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే మళ్లీ వైసిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ గా మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా చింత రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవి కుమార్, కదిరాయచెరువు, ప్రత్యేక ఆహ్వానితులు జివి.కిషోర్, మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, మండల సచివాల కన్వీనర్ మోహన్‌రాజా, మాజీ సర్పంచ్ కుమార్ నాయుడు, సుధాకర్‌నాయుడు, హరినాథ్‌నాయుడు, వైసిపి నాయకులు అంజన్‌కుమార్, చల మయ్య శ్రీనివాసులు, పుల్లయ్య, కరిముల్లా, ఆర్‌బికె చైర్మన్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-చిన్నమండెం

రాయచోటి టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు నిశ్చల్‌నాగిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం, అవినీతి లేని పాలన కోసం టిడిపిని గెలిపించాలని కోరారు. పలువురు మహిళలు పలు సమస్యలను అయన దృష్టికి తీసుకురాగా ప్రస్తుత ప్రభుత్వం ప్రజల సమస్యలను తీర్చడంలో విఫలమైందని, రాబోయే టిడిపి పాలనలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నాం : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలో సి విజిల్, ఎన్ కోర్, ఇఎస్ఎంఎస్ ద్వారా అందిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నామని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి పెండింగ్ ఫామ్స్ 6, 7, 8, 8 ఎ, ఎన్‌కోర్, సి-విజిల్, ఇఎస్ఎంఎస్, కౌంటింగ్ కేంద్రాల ఎంపిక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వర్నబిలిటి మ్యాపింగ్, హోంఓటింగ్, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తదితర అంశాలలో కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు అంశాలలో దిశా నిర్దేశం చేశారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణరావు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమాలని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. పెండింగ్ ఫామ్స్ 6, 7, 8, 8ఎలపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని సంబంధిత ఇఆర్ఒ అధికారులకు సూచించారు. సి విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఎస్ఎస్‌టి, విఎస్‌టి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుపరిచేలా కృషి చేయాలన్నారు.

## 'బిజెపి నుంచి దేశాన్ని రక్షించుకుందాం'

ప్రజాశక్తి-ములకలచెరువు

రాజ్యాంగ హక్కులను మంట కలుపుతున్న మతోన్మాద బిజెపిని ఓడించి దేశాన్ని రక్షించుకోవాల్సిన తక్షణ అవసరం ప్రతి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తపైనా, దేశ పౌరులందరి పైనా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మదనపల్లె రోడ్డులోని పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ యొక్క సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన పి.ఎల్.నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణప్పలు మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి దేశ ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తుందని, నల్ల చట్టాలపై దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమంలో కేంద్రం ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని బిజెపి కుట్రలు పన్నుతోందని, రాముడు పేరుతో ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టి ఓట్లు పొందాలని చూడడం చాలా దారుణాతిదారుణం అన్నారు. బిజెపికి మద్దతిస్తున్న ప్రాంతీయ పార్టీలను ఓడించేందుకు కార్మికులు, కర్షకులు, యువకులు, మేధావులు, మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, మండల కార్యదర్శి కె.అంజనప్ప, మండల కార్యవర్గ సభ్యులు నరసింహులు పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## భూ తగాదాలో రెండు గ్రూపులు ఘర్షణ

### - కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ, కొండకిందపల్లిలో రెండు వర్గాల మధ్య భూమి విషయంగా ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరు వర్గాలకు చెందినవారు గాయపడ్డారు. కె.రెడ్డి శేఖర్ అనే వ్యక్తి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.అదే ఘర్షణలో గాయపడ్డ మరో వర్గానికి చెందిన లక్ష్మీనరసు ఫిర్యాదుపై మొదటి వర్గంపైన కేసు నమోదు చేశారు. ఘటన స్థలం వద్దకు బి.కొత్తకోట ఎస్ఐ తమ సిబ్బందితో చేరుకొని పరిశీలించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బి.కొత్తకోట పోలీసులు అరెస్టు చేశారు.ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..మంగళవారం సాయంత్రం బిసి కాలనీలో షేక్ ఆలీసాబ్ అనే వ్యక్తి కర్ణాటకకు చెందిన మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్నటువంటి 1.08 లీటర్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడుపై కేసు నమోదు, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాటుసారా తయారీ, విక్రయం, ఇతర రాష్ట్రాల మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు సమీపంలో గల అశోక్ గార్డెన్స్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. వారి బంధువులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వత్తలూరు వడ్డి పల్లెకు చెందిన బుర్సు హరి(24) చిట్వేలి మండలం వడ్డీ పల్లెకు చెందిన శ్రీలేఖతో సుమారు ఐదు నెలల క్రితం వివాహం జరిగినట్లు తెలిసింది. భార్య భర్తలు ఇరువురు బుధవారం చిట్వేలికు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా అశోక్ గార్డెన్స్ వద్ద జాతీయ రహదారిలో వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా అతని భార్య శ్రీలేఖకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు రాజంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. వివాహమైన ఐదు నెలలకే రోడ్డు ప్రమాదం రూపంలో భర్త దూరం కావడంతో శ్రీలేఖ, మృతుడి బంధువులు బోరున విలపించడంతో ఆస్పత్రి వద్ద రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.